క్లుప్తంగా

నేడు రెంటచింతలలో గడప గడపకు మన ప్రభుత్వం

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండల కేంద్రమైన రెంటచింతలలోని ఎర్రబాలెం కాలనీలో నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి ఆదివారం తెలిపారు. ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సాయంత్రం 5.30 గం.లకు 42 వ సచివాలయంలో 171వ రోజు గడప గడప కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ప్రతి గడపకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ఎంతమేర లబ్ధిచేకూరిందో వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వెంట మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను తెలుసుకుని వారికి ఆయా సంక్షేమ పథకాలను అందించడమే కాకుండా స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను కూడా అక్కడికక్కడే ఈ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పరిష్కరించనున్నట్టు ఆయన తెలిపారు.

శ్రీ కృష్ణ భగవానుడి ఊరేగింపు



పిడుగురాళ్ల: పట్టణంలోని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ భగవానుడి ఊరేగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పట్టణంలో శ్రీ కృష్ణాష్టమి రోజు నుంచి 5 రోజుల పాటు నిత్య పూజలు చేసి ఆదివారం శ్రీ కృష్ణ స్వామి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సభ్యులు కటికం సైదారావు, కె.అరుణ, కె.కోటేశ్వరావు, కె. నారాయణమ్మ, కె.గోపి, డి.శ్రీను, ఎమ్. వీరయ్య, ఎస్.వెంకట లక్ష్మీ, సీహెచ్ అనురాధ, టి.రాఘువ, ఎం.అమర్, బి.చిరంజీవి, బి.శివ, అనంతలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మడేలయ్య స్వామి తిరునాళ్ల

గురజాల : మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో వేంచేసియున్న మడేలయ్య స్వామి వారి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం నిర్వహించారు. వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజక సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. కుంకుమబండ్లు కట్టి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మడేలయ్య స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ

పిడుగురాళ్ల: పట్టణంలోని గంగమ్మ తల్లి అమ్మవారిని శ్రావణమాసం నాల్గవ ఆదివారం సందర్భంగా విశేషంగా గాజులతో అలంకారం చేసి భక్తుల దర్శనార్థం ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

21న ఉచిత కృత్రిమ పాదాల శిబిరం

మాచర్ల: వాసవి క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ, రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉచిత కృత్రిమ పాదాలు ఇచ్చేందుకు శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావు, చిన్ని సత్యనారాయణలు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ చేతన ఫౌండేషన్, బార్బిలై ఫౌండేషన్‌ల ఆర్థిక సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రామాటాకీస్ థియేటర్ వెనుక బీఎస్ఆర్ కళ్యాణ మండపంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9849065882ను సంప్రదించాలని కోరారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల దివ్యాంగులు, కృత్రిమ పాదాలు అవసరమున్న వారు ఈ శిబిరానికి వచ్చి సద్వినియోగం చేసుకోవాలని వ్యవస్థాపకులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు తెలిపారు.

ఘనంగా అంకాలమ్మ బోనాల జాతర



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలో 3వ వార్డు ఇందిరానగర్‌కు చెందిన వడియరాజుల సంఘం ఆధ్వర్యంలో అంకాలమ్మ బోనాల జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ దేవ్వళ్ల అంజమ్మ ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో ఏనుగుపాలెం రోడ్డులోని అంకాలమ్మ గుడి వద్దకు చేరుకున్నారు. పొంగళ్లు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వడియరాజుల సంఘం నాయకులు కుమార్, వాసు, ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ, ఇందిరా నగర్ వాసులు పాల్గొన్నారు.

వైభవంగా వీర్ల అంకాలమ్మకు బోనాలు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రంలో కొలువైన పల్నాటి ప్రజల ఇలవేల్పు వీర్ల అంకాలమ్మకు బోనాల ఉత్సవం ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. మహిళలంతా నిష్ఠతో పొంగళ్లు చేసుకుని సామూహికంగా అమ్మవారి కుంకుమ బండ్ల వెంట ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఊరంతా రంగుల మయంతో యువకుల విన్యాసాలు ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమం కొనసాగింది. మహిళలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంతో కారెంపూడిలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం పోలేరమ్మ తల్లి, పాతపాటేశ్వరమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని అక్కడ అమ్మవార్లకు పోతురాజుకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కన్నుల పండువగా కార్యక్రమం కొనసాగింది. శ్రావణమాసం అంతా గ్రామంలోని అన్ని సామాజిక వర్గాల వారు వంతుల వారీగా అమ్మవారికి బోనాలు సమర్పించే సంప్రదాయం పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో అనాదిగా కొనసాగుతోంది. ఇదిలా ఉంటే పల్నాటి వీరాచారవంతులు కూడా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి





అమ్మవారి ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు (ఇన్‌సెట్) అంకాలమ్మ ఆలయం వద్ద పండుగ వాతావరణం

పల్నాటి వీరుల గుడిలో నైవేద్యాలు వండుకుని అక్కడ నుంచి అంకాలమ్మ తల్లి, చెన్నకేశవస్వామి ఆలయాలకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

క్రీడా 'స్ఫూర్తి నైనా'

వరుసగా మూడోసారి స్టేట్ నంబర్ వన్‌గా..

కారెంపూడి: ఒంగోలులో ఆదివారం రాత్రి ముగిసిన అండర్ 11 ఏపీ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్ 2023లో పల్నాడు జిల్లా కారెంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి చెందిన చదల స్ఫూర్తి నైనా ఫస్ట్ ప్లేస్ సాధించి బంగారు పతకం గెలుచుకుంది. ఇదిలా ఉంటే స్ఫూర్తి నైనా రాష్ట్ర స్థాయిలో వరుసగా మూడోసారి బంగారు పతకం సాధించి అండర్ 11 విభాగంలో వరుస విజేతగా నిలిచి అరుదైన రికార్డు సృష్టించారు. గత జూన్‌లో 8, 9 తేదీలలో రాజమహేంద్రవరంలో, అలాగే ఆ తర్వాత విజయవాడలో ఇప్పుడు ఒంగోలులో జరిగిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలలో స్ఫూర్తినైనా రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. పేదరికంలో ఉన్న గిరిజన కుటుంబానికి చెందిన నైనా శిక్షణ తీసుకునేందుకు డబ్బు లేక తండ్రి శిక్షణలోనే ఈ విజయాలు సాధించింది. బాలిక కారెంపూడిలోని వివేకానంద ప్రైవేటు పాఠశాలలో



ధ్రువీకరణ పత్రం, గోల్డ్ మెడల్ అందుకుంటున్న స్ఫూర్తి నైనా

ఆరవ తరగతి చదువుతోంది. తండ్రి ఏసుబాబు పీఈటీగా ప్రైవేటు స్కూల్‌లోనే పని చేస్తూ బాలిక ప్రతిభను గుర్తించి ఆమెకు ఇంట్లోనే శిక్షణ ఇస్తున్నారు. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో విజయంసాధించి ఆ తర్వాత ఒలింపిక్స్‌లో రాణించాలని స్ఫూర్తి నైనా కలలు కంటోంది.

ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు

దాచేపల్లి : ప్రభువైన ఏసుక్రీస్తును ఆరాధించాలని పాస్టర్ గనుపల్లి శ్యాం ప్రసన్నకుమార్ అన్నారు. విస్తారంగా వర్షాలు కురిసి పంటలు పండాలని, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని, ప్రభుత్వాలు ప్రజల కోసం పనిచేయాలని కోరుతూ మండలంలోని కేసానుపల్లి లూథరన్ చర్చిలో ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు ఆదివారం జరిగాయి. సంఘస్థులు ఉపవాసం ఉండి ఈ ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కరువు వచ్చినప్పుడు పూర్ణహృదయంతో క్రీస్తును ఆరాధించాలని, దేవుడిని ప్రార్థన చేయటం ద్వారానే కరువు బారినుంచి ప్రజలంతా బయట పడవచ్చునని చెప్పారు. దేశంలో కరువు అధికంగా ఉందని, అందరూ కూడా ప్రార్థనలో ఉండి భగవంతుడి దీవెనలు పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఎల్‌సీ డెలిగేట్ వినుకొండ బాబు, చర్చి డెలిగేట్ శ్రీపతి కాశయ్య, సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, ఎంపీటీసీ ఏసుదాసు పాల్గొన్నారు.

నేడు మాచర్లలో..



ఉపవాస ప్రార్థనలో పాస్టర్ ప్రసన్నకుమార్

మాచర్ల: పట్టణంలోని 24వ వార్డులో, చెన్నకేశవ స్వామి దేవాలయ వెనుక భాగంలో క్రైస్తవ మరనాత ప్రార్థనా మందిరంలో నేడు ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ వై.ఎలీషా ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి ఉపవాస ప్రార్థనలు ప్రారంభమై ముగింపు కూడిక జరుగుతుందన్నారు. ముఖ్య ప్రసంగీకులుగా హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ కాలేబు ప్రసంగిస్తారన్నారు. ఈ ఉపవాస కూడికకు క్రైస్తవులందరూ తప్పక హాజరు కావాలన్నారు.

మన్యం ప్రసాద్ స్ఫూర్తితో పోరాటం

కేఎన్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ

నరసరావుపేట: దళితులు, ఆదివాసీలు, ముస్లిం, క్రైస్తవులపై హిందూ మతోన్మాద శక్తుల దాడులకు వ్యతిరేకంగా కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మన్యం ప్రసాద్ స్ఫూర్తితో పోరాటం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎన్. కృష్ణ పిలుపు ఇచ్చారు. నయీం ముఠా చేతిలో మన్యం ప్రసాద్ హత్యకు గురై 18ఏళ్లు ముగిసిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం ఎన్‌జీవో హోమ్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సంస్మరణ సభకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 1985 నుంచి పీడిత ప్రజల పక్షాన చనిపోయేంత వరకు ప్రసాద్ పోరాటం చేశారని తెలిపారు. మణిపూర్‌లో ఆదివాసీలు, క్రైస్తవులపై దాడులు–మన కర్తవ్యం అనే అంశంపై విరసం రాష్ట్ర నాయకులు సి.ఎస్.ఆర్. ప్రసాద్ మాట్లాడుతూ మణిపూర్‌లో దాడుల్ని అరికట్టడంలో కేంద్రం తీవ్రంగా విఫలమైందని విమర్శించారు.



మాట్లాడుతున్న విరసం రాష్ట్ర నాయకుడు సి.ఎస్.ఆర్ ప్రసాద్

యూనిఫైడ్ సివిల్ కోడ్–పర్యవ్యసనాలు అనే అంశంపై ఎస్.ఉషా దాని మాట్లాడుతూ మైనార్టీల సంస్కృతి, సంప్రదాయాలపై దాడులుగానే పరిగణించాలని తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఈ.శ్రీరాములు, సుబ్బరాయుడు, దుడ్డు వెంకట్రావు, కృష్ణయ్య, పెద్దసంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కాల్వలను పొడిగించాలి

చిలకలూరిపేట: సాగునీటి అవసరాల్ని దృష్టిలో పెట్టుకొని సాగర్ కాల్వల పొడిగింపు కోసం రైతు సంఘాల నాయకులు ఐక్యం కావాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సంఘ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కిందట చిలకలూరిపేట, పర్చూరు, ప్రత్తిపాడు తదితర ప్రాంత రైతుల్ని పొగాకు కంపెనీల యాజమాన్యాలు వంచించి, సాగర్ కాల్వల పొడిగింపు అడ్డుకున్నాయని వివరించారు. దీని కారణంగా ఈ ప్రాంతాల్లో సాగర్ జలాలు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు తాగు, సాగు నీటి అవసరాల కోసం ఆందోళనలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

సాగర్ కాల్వల పొడిగింపు కోరుతూ ఈ నెల 24న ప్రత్తిపాడులో, 27న చిలకలూరిపేటలో రైతు సంఘం ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటిని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు తాళ్లూరి బాబూరావు, నాయకులు ఉలవలపూడి రాము, వడ్డే హనుమారెడ్డి, కొల్లి రంగారావు, అమర లింగేశ్వరరావు, సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామ సుబ్బాయమ్మ పాల్గొన్నారు.

రూ.50వేలు విరాళం

అమరావతి: స్థానిక శ్రీసరస్వతీ శిశు మందిర్ అభివృద్ధికి గుంటూరుకు చెందిన వ్యవసాయ శాఖ విశ్రాంత ఉద్యోగి మన్నవ రత్నప్రకాశరావు, భారతి దంపతులు ఆదివారం రూ.50 వేలు విరాళమిచ్చారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను నిరంతరం విద్యార్థులకు తెలియ జెప్పటంలో సరస్వతీ శిశుమందిర్‌లో ఆచార్యుల పాత్ర ప్రధానమని దాత రత్న ప్రకాశరావు అన్నారు. ఇటువంటి విద్యాసంస్థ ఎంతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయుడు కోలా వెంక టేశ్వరరావుకు నగదు చెక్కు అందజేశారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సహాయం



పిడుగురాళ్ల: దుర్గి మండలంలోని రాజా డిజిటల్ స్టూడియో యజమాని కోవూరి రఘుచంద్ర మృతి చెందటంతో వారి కుటుంబానికి రూ.75,000 ఆర్థిక సహాయాన్ని పల్నాడు ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అందజేశారు. వారి కుటుంబానికి పల్నాడు వెల్ఫేర్ అసోసియేషన్ ఎప్పుడూ అండగానే ఉంటుందని కుటుంబసభ్యులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు విద్యాధరిణి నరసరాజు, ఉప కార్యదర్శి రామినేని భరత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సీదా రామారావు, ఐతంరాజు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సన్మానం



వినుకొండ(నూజెండ్ల) : ఉత్తమ ఉపాధ్యాయురాలిగా కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్న శావల్యాపురం జెడ్పీ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయురాలు తేళ్ల నిర్మల భాస్కర్ దంపతుల్ని వినుకొండ పట్టణంలోని ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు గుండాల స్వెనోమ్ మాట్లాడుతూ ఉపాధ్యాయురాలిగా నిర్మల కృషిని అభినందించారు. కార్యక్రమంలో పాస్టర్ పి.ఫిలిప్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో....

కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగస్తులుగా అవార్డులు అందుకున్న దారా సంగీతరావు, మల్లబత్తిన ప్రకాశరావును స్థానిక మాలమహానాడు సంఘం కార్యాలయంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు కీర్తిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో సంగీతరావు, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో ప్రకాశరావు సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు కోంద్రు విజయ్, దార్ల ఎర్రయ్య, కొమ్మతోటి కృపయ్య, గుడిపూడి ఏసురత్నం, బేతం దేవానంద్, జ్యోతి మల్లికార్జున, బేతం బాల కృష్ణ, పిడతల రాజా, పెనుమాల రమేష్ పాల్గొన్నారు.

ఓటర్ల దరఖాస్తులపై విచారణ

ముప్పాళ్ళ: ఓటు హక్కు కోసం అందించిన అర్జీలపై బీఎల్‌ఓలు ఆదివారం విచారణ చేపట్టారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జాబితా పరిశీలన, ఫారం–6పై విచారించారు. 320కి పైగా అర్జీలు కొత్తగా ఓటుహక్కు కోసం అందాయి. దరఖాస్తులోని అంశాలను తనిఖీ చేసి, వారికి ఓటు హక్కు పొందేలా చర్యలు చేపట్టారు. ముప్పాళ్ల, గోళ్లపాడు, చాగంటివారి పాలెం గ్రామాల్లో జరుగుతున్న తనిఖీలను డిప్యూటీ తహసీల్దారు సీహెచ్‌లక్ష్మీ ప్రసాదు పరిశీలించారు.

కొండమోడులో పారిశుద్ధ్య పనులు



రాజుపాలెం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరి చేరవని మలేరియా సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కొండమోడులో డెంగీ ఆనవాళ్ల అనుమానంతో ఆరోగ్య సిబ్బంది ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మలేరియా అధికారి మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని, దోమ తెరలు వాడాలని గ్రామస్తులకు సూచించారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగీ, మెదడువాపు, బోధకాలు, చికెన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. అనంతరం సైడు కాలువల్లో పూడికతీత చేపట్టి, బ్లీచింగ్ చల్లించారు. 95 ఇళ్లకు వెళ్లి జ్వర పరీక్షలు నిర్వహించగా.. ఎవరికీ, ఎలాంటి జ్వరాలు లేవని హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శారద, హెల్త్ అసిస్టెంట్‌లు కిరణ్‌బాబు, రాజు, ఆశా కార్యకర్తలు మరియమ్మ, సుజాత, సైదమ్మ, మీరాబీ పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ పండుగ

విజయపురిసౌత్: మాచర్ల మండలం చింతలతండా గ్రామంలో మధ్య తండా, కింది తండాలలో మహాలక్ష్మమ్మ దేవాలయంలో పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మమ్మ పండుగ వేడుకలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ప్రభుత్వ విప్ పీఆర్కేను గ్రామస్థులు ఘన స్వాగతం పలికి శాలువా, పూలదండలతో సత్కరించారు. పీఆర్కే గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇటీవల పీఆర్కే గ్రామంలో రెండు మహాలక్ష్మమ్మ దేవాలయాల అభివృద్ధికి 4లక్షల రూపాయల నిధులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, సర్పంచ్ కేతావత్ శ్రీనునాయక్, ఎంపీటీసీ సీతానాయక్, పూజారి రమావత్ భీక్యానాయక్, పలువురు నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

కనకదుర్గ అమ్మవారికి బోనాలు సమర్పణ

గురజాల : నగర పంచాయతీలో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారికి ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. మహిళలు బిందెలతో నీటిని తీసుకుని దేవాలయంకు వెళ్లి వర్షాలు సమృద్ధిగా కురిసి అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

రెంటచింతల: బాల్య వివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని ప్రముఖ న్యాయవాది కలివేల ప్రభుదాసు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన రెంటచింతలలో కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాలూరి అమర్‌నాథ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బాల బాట విజన్ 2030 అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మైనర్ (బాలికకు 18సం.లు, బాలుడికి 21 సం.లు నిండని) బాలబాలికల వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దళిత పేద వర్గాలు విద్య ద్వారా అభివృద్ధి చెందుతాయని కార్డ్స్ సంస్థ గుర్తించి బాలబాట కార్యక్రమాలు నిర్వహించి వారిలో చైతన్యం తీసుకువస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ అమర్‌నాథ్ మాట్లాడుతూ అనుశక్తి కన్నా అక్షర శక్తి ఎంతో గొప్పదని బాల బాట ద్వారా గ్రామాలలో, మారుమూల తండాలలో డీఓలు ఉచిత విద్యను అందిస్తూ కృషి చేయాలని కోరారు. అనంతరం డీఓలతో డ్రిల్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కె.వెంకయ్య మాస్టర్, నందనాయక్, ఏసీఓ వేల్పుల రవి, కార్డ్స్ సంస్థ కో–ఆర్డినేటర్ డి.సుధాకర్, రెంటచింతల, గురజాల మండలాలకు చెందిన 30 మంది డీఓలు పాల్గొన్నారు.



కార్డ్స్ సంస్థ ప్రతినిధులతో ప్రభుదాసు, విద్యార్థులు

విధి నిర్వహణలో అంకితభావం అవసరం

ఈఆర్వో కందుల శ్రీరాములు

శావల్యాపురం: బీఎల్‌వోలంతా విధుల్ని అంకితభావంతో నిర్వహించి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని వినుకొండ నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఈఆర్వో) కందుల శ్రీరాములు తెలిపారు. ఆయన ఆదివారం మండలంలోని కారుమంచి, గుంటుపాలెం, మతుకుమల్లి, శానంపూడి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్ని పరిశీలించిచారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 299 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2.56లక్షల ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు, మార్పులు చేర్పులపై వచ్చిన అభ్యంతరాల్ని క్షణ్ణంగా పరిశీలించి, అనంతరం నివేదికను జిల్లా ఎన్నికల అధికారికి పంపుతామని తెలిపారు. నియోజవర్గ స్థాయిలో ఫామ్–6,7,8 దరఖాస్తులు 14,569 వచ్చినట్లు పేర్కొన్నారు. బీఎల్‌వోలు వాటిని క్షేత్రస్థాయిలో విచారణ చేసి సమగ్ర ఆధారాలు అందజేసిన వారందరికీ ఓటుహక్కు కల్పించాలని ఆయన ఆదేశించారు. నియోజకవర్గంలో 100 సంవత్సరాలు దాటిన వారు 81 మందిని గుర్తించామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రత్యేక అవసరాల కల్గిన (వికలాంగులు) వారు పోలింగ్ కేంద్రాలకు రాకుండానే ఓటుహక్కును వినియోగించే విధంగా ఎన్నికల కమిషన్ ప్రత్యేక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. మొబైల్ యాప్‌లో నమోదు చేసుకుంటే, ఇంటి దగ్గర నుంచే ఓటుహక్కును వినియోగించుకోవచ్చని ఆయన సూచించారు. శావల్యాపురం మండలంలో



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఈఆర్‌ఓ శ్రీరాములు

ఫామ్–6,7,8 దరఖాస్తులు 2,532 దరఖాస్తులు వచ్చాయని, సత్వరమే సమగ్ర ఆధారాలు అందించిన వారికి న్యాయం జరిగేలా చూడాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, డిప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పి.నాసరయ్య, ఆర్ఐ చంద్రబాబు, వీఆర్వోలు దూపాటి దేవమ్మ, కార్యదర్శి చింతా శ్రీనివాసరావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రొంపిచర్లలో ఆర్డీవో పర్యటన

రొంపిచర్ల: ఆర్డీవో శేషిరెడ్డి ఆదివారం రొంపిచర్లలోని పోలింగ్ బూత్‌ల పరిధిలో పర్యటించారు. బీఎల్‌వోలు నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఒకే ఇంటి నంబరుపై పది ఓట్లు, 100 ఏళ్లకు పైబడిన వృద్ధ ఓటర్లు, మృతి చెందిన ఓటర్ల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఫాం 6,7,8 అర్జీలను సకాలంలో విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. అవకతవకలకు, ప్రలోభాలకు పాల్పడకుండా విచారణ నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో నరసరావుపేట, రొంపిచర్ల తహసీల్దార్లు రమణానాయక్, అంకారావు, రెవెన్యూ అధికారులు చంద్రశేఖరరావు, సుబ్బారెడ్డి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కోదండరామాలయంలో పునర్వసు నక్షత్ర పూజలు

నాదెండ్ల: గణపవరంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో ఆదివారం పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి దర్శి అనిల్‌కుమార్ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పంచామృతాభిషేకాలు, గోత్ర నామ పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉదయం 6.35 గంటలకు ప్రారంభమైన పూజలు 8 గంటల వరకూ కొనసాగాయి. కార్యక్రమాల్ని ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



వైద్యురాలిగా ప్రభావతి సేవలు ఆదర్శనీయం

లక్ష్మీపురం: గుంటూరు జీజీహెచ్ ప్రభుత్వ సమగ్రాసుపత్రి సూపరింటెండెంట్‌గా విశేష సేవలందించిన డాక్టర్ ప్రభావతిని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో సత్కరించడం సంతోషదాయకంగా ఉందని కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య రంగానికే తలమానికంగా నిలిచి, ఎటువంటి క్లిష్టమైన జబ్బులనైనా ఇట్టే నయం చేస్తూ వైద్య వృత్తికే డాక్టర్ ప్రభావతి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ నగర ప్రజల సహాయ, సహకారాలతోనే జీజీహెచ్‌లో సేవలు అందించినట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ ప్రభావతిని ఘనంగా సత్కరించారు. సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో జీవితాల్ని బలి చేసుకోవద్దు

దేశంలో రోజురోజుకూ ఆత్మహత్యలు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోందని, చిన్న చిన్న సమస్యలకే బెంబేలెత్తి పోయి చేతులారా నిండు జీవితాన్ని నాశనం చేసుకునే స్థితి నుంచి బయటపడాలని ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కె.సురేష్‌కుమార్ సూచించారు. అరండల్‌పేటలోని కార్యాలయంలో ఆదివారం ఆత్మహత్య..మానసిక సమస్యే అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో 15 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు వారే ఎక్కువని తెలిపారు క్షణికావేశంలో నిండు జీవితాల్ని బలి చేసుకుంటున్న వారి వల్ల కుటుంబ సభ్యులు కుదేలై పోతున్నారని చెప్పారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com